క్లుప్తంగా

రచయిత్రి సుధకు డొక్కా సీతమ్మ అవార్డు



డొక్కా సీతమ్మ ఇన్‌స్పిరేషనల్ అవార్డు అందుకుంటున్న రచయిత్రి సుధ

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన రచయిత్రి పచ్చిగోళ్ల సుధకు డొక్కా సీతమ్మ ఇన్‌స్పిరేషనల్ అవార్డు లభించింది. ఫిలాంత్రోఫియా సంస్థ కాకినాడ నాగమల్లితోటలోని కళా వాణి ఫంక్షన్ హాలులో సుధకు ఈ అవార్డును ఆదివారం ప్రదానం చేసింది. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ ఎస్పీ కొండా నరసింహారావు చేతుల మీదుగా సుధ ఈ అవార్డును అందుకున్నారు. ఎంఎస్ఆర్ ట్రస్ట్ ద్వారానే కాకుండా ఓ మహిళా రచయితగా సుధ అందిస్తున్న సేవలకు గాను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫిలాంత్రోఫియా సంస్థ తెలిపింది.

ఇందుపల్లిలో సువాసినీ పూజ



ఇందుపల్లిలో సువాసినీ పూజతో మహిళలకు సత్కారం

అమలాపురం రూరల్: దసరా నవరాత్రుల్లో భాగంగా అమలాపురం మండలం ఇందుపల్లిలో బాల భక్త గణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో సువాసినీ పూజ ఆదివారం ఘనంగా జరిగింది. మహిళలను నవదుర్గలుగా భావించి 9 మంది సువాసినీలకు పాద పూజ నిర్వహించారు. అనంతరం పేరి సత్యవాణి ఆధ్వర్యంలో సౌందర్యలహరి పారాయణ చేశారు. కార్యక్రమంలో బాలభక్త సంఘం అధ్యక్షుడు టీకే విశ్వనాథం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

అల్లవరం: మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎ.ఆనందరావు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తారని ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆదివారం తెలిపారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమక్షంలో ప్రజా వేదిక నిర్వహిస్తామన్నారు. మండలం వ్యాప్తంగా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నైపుణ్య సాధనకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం

ముమ్మిడివరం: వృత్తి విద్యను అభ్యసించడం ద్వారా భవిష్యత్‌లో రాణించడానికి అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చునని జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి ఎంఏకే భీమారావు అన్నారు. సమగ్ర శిక్ష స్టేట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శనివారం అనాతవరం గవర్నమెంట్ హైస్కూల్లో నిర్వహించిన ఇంటర్న్ షిప్ ప్రోగ్రాంను ఆయన పర్యవేక్షించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ కోర్సులను అభ్యసించడం ద్వారా పొందే ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసెక్ట్ కోఆర్డినేటర్ ఎం.భుజంగరావు, ఒకేషనల్ ట్రైనర్ ఎం.ప్రవీణ్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతతో అభివృద్ధి

యానాం: సమాజంలో మహిళాసాధికారితతోనే కుటుంబాల అభివృద్ధి సాధ్యమని ఆర్ఏఓ మునిస్వామి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బేటీబచావో బేటీపఢావో కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు. స్థానిక మదర్‌థెరిసా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, ఐటీఐ విద్యార్థులు 120 మంది ప్రత్యేక బస్సులో దరియాలతిప్ప వెళ్లారు. అక్కడ నుంచి బోటుషికారు చేస్తూ ఐలాండ్-3ను సందర్శించారు. కార్యక్రమంలో ఆర్ఏఏ సూపరింటిండెంట్ కె.సత్యనారాయణ, అధికారి రెయ్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిప్‌మర్ నర్సింగ్ కోర్సుల్లో అడ్మిషన్లు

యానాం: పుదుచ్చేరి జిప్‌మర్‌లో బీఎస్సీ నర్సింగ్, హెల్త్‌సైన్సెస్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ సంస్థ ఆదివారం ప్రకటన విడుదల చేసింది. పుదుచ్చేరి జిప్‌మెర్‌లో బీఎస్సీ నర్సింగ్‌లో 94 సీట్లు ఖాళీగా ఉన్నాయి. వాటిలో 85 సీట్లు మహిళలకు, 9 సీట్లు పురుషులకు కేటాయించారు. అదేవిధంగా అలైడ్ హెల్త్‌సైన్సెస్ కోర్సుల్లో 87 సీట్లకు కూడా అడ్మిషన్లు జరుగుతాయి. వివరాలకు జిప్‌మర్ వెబ్‌సైట్‌ను దర్శించాలని, నీట్ ఆధారంగా జరిగే అడ్మిషన్లకు అర్హత గల అభ్యర్థులు ఈనెల 24 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులు ఆధారంగా నవంబర్ 8 న లేదా అంత కంటే ముందు మెరిట్ జాబితా వెబ్‌సైట్‌లో ఉంచుతారు. నవంబర్ 25 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి.

తపాలా చరిత్ర చాటుదాం

- నేటి నుంచి తపాలా వారోత్సవాలు
- 239 పోస్టల్ కార్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు
- డివిజన్ పోస్టల్ శాఖ ఏర్పాట్లు



అమలాపురంలోని డివిజన్ ప్రధాన తపాలా కార్యాలయం

అమలాపురం టౌన్: దాదాపు 150 చరిత్ర కలిగిన తపాలా సేవలపై భారత తపాలా శాఖ ప్రజలకు ముఖ్యంగా తపాలా వినియోగదారులకు చైతన్యంతో ఆ చరిత్రను వివరించేందుకు, సేవలపై అవగాహన కల్పించేందుకు సిద్ధమైంది. ఈనెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ నిర్వహించే తపాలా వారోత్సవాల్లో భాగంగా అమలాపురం పోస్టల్ డివిజన్ అందుకు అనుగుణంగా వారోత్సవాల నిర్వహణకు రోజు వారీ ప్రణాళిక ఏర్పాట్లు చేసింది. పోస్టల్ డివిజన్‌లోని రెండు హెడ్ పోస్టాఫీసులు, 39 సబ్ ఆఫీసులు, 198 బ్రాంచి ఆఫీసులు మొత్తం 139 పోస్టల్ కార్యాలయాల్లో వారోత్సవాలను చైతన్యవంతంగా నిర్వహించేందుకు డివిజన్ పోస్టల్ శాఖ ఆయా కార్యాలయాల్లో ఏర్పాట్లు చేసింది. పోస్టల్ శాఖ పలు రకాలుగా అంటే అటు తపాలా సేవలతో పాటు ఇటు పొదుపు, బీమా, బ్యాంకింగ్‌తో పాటు వివిధ పథకాలపై వారోత్సవాల్లో ప్రజలకు అవగాహన కల్పించనుంది. ముఖ్యంగా విద్యార్థులకు తపాలా సేవలపై చైతన్యం తీసుకురానుంది. భారత తపాలా శాఖ ప్రత్యేక సందర్భాల్లో విడుదల చేసిన స్టాంపులను ప్రదర్శించి వాటి గురించి వివరించనుంది. ఇందుకోసం వారోత్సవాల్లో పొందుపరిచిన ఫిలాటెలీ దినోత్సవాన్ని వేదికగా మలుచుకోనుంది. అమలాపురం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.శ్రీధర్ పర్యవేక్షణలో ఈ వారోత్సవాల నిర్వహించనున్నారు.

ఇవీ రోజు వారీ ప్రణాళికలు..

- తొలి రోజు సోమవారం పోస్టల్ శాఖ నిర్వహించే మెయిల్స్ అండ్ పార్సెల్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. ప్రధానంగా ఈ రెండు సేవలపై పోస్టమన్, డెలివరీ స్టాఫ్‌కి వంద శాతం లక్ష్యం సాధించే దిశగా వర్క్ షాపులు నిర్వహిస్తారు. మెయిల్స్, పార్సెల్ సర్వీసుపై వినియోగదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. డాక్ గర్ నియత్ కేంద్రం గురించి చైతన్యపరుస్తారు.
- రెండో రోజు మంగళవారం ఫిలాటెలీ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. విద్యార్థులకు, ఖాతాదారులకు స్టాంపుల సేకరణపై అవగాహన కల్పిస్తారు. ఫిలాటెలీ డిపాజిట్లు తెరిచే అంశంపై చైతన్యపరుస్తారు. స్టాంపు సేకరణకర్తలతో పురాతన స్టాంపుల ప్రదర్శన ఏర్పాటు చేస్తారు. విద్యార్థులకు డాక్ ఆఖర్‌పై వ్యాస రచన పోటీలు, పాఠశాలల్లో పోస్టల్ సేవలు, ఉత్తరాలపై ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తారు.
- మూడో రోజు బుధవారం ప్రపంచ తపాలా దినోత్సవం జరుగుతుంది. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్టు ఆఫీసుల్లో బ్యానర్లు కట్టి సంబరాలు నిర్వహిస్తారు. ఫిట్ పోస్ట్, ఫిట్ ఇండియా, మెసేజ్ పేరుతో ర్యాలీని ఏర్పాటు చేస్తారు.
- నాలుగో రోజు గురువారం అంత్యోదయ దివస్ పేరుతో తపాలా శాఖ అందిస్తున్న స్పీడ్ పోస్ట్, గంగా జలం పంపిణీ, జన సురక్ష పథకం, సుకన్య ఖాతా, ఆధార్ సేవలు తదితర సేవలపై విస్తృత ప్రచారం చేస్తారు. కొత్తగా అమలవుతున్న ×బుక్ నౌ పే లేటర్ (బీఎస్‌పీఎల్) నమోదు కార్యక్రమంపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తారు.
- అయిదో రోజు శుక్రవారం తపాలా సేవింగ్స్ బ్యాంక్, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ అందించే సేవలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. బీమాపై చైతన్యపరిచి కొత్త పాలసీల సేకరణ, ఆపేసిన పాలసీల పునరుద్ధరణ, పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను పరిష్కరించే కార్యక్రమాలు నిర్వహిస్తారు.

> **వారోత్సవాలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం**
>
> 
>
> పోస్టల్ డివిజన్‌లో ఉన్న హెడ్ పోస్టాఫీసులు, సబ్ ఆఫీసులు, బ్రాంచి ఆఫీసుల్లో సోమవారం నుంచి తపాలా వారోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం. ఇందుకు పోస్టు మాస్టర్లు, పోస్టల్ సిబ్బందికి వారోత్సవాల్లో రోజు వారీ ప్రోగ్రామ్‌ల టైమ్ టేబుల్స్ పంపించి అందుకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహించనున్నాం. తపాలా చరిత్రతో పాటు సేవలు, పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన తీసుకుని వచ్చే దిశగా భారత పోస్టల్ శాఖ ఏటా ఈ వారోత్సవాలను నిర్వహిస్తోంది. పోస్టల్ సేవలను ప్రజల్లోకి మరింత వేగంగా తీసుకుని వెళ్లేందుకు వారోత్సవాలను ఈ వేదికగా ఉపయోగించుకుంటాం. ప్రజలు, ముఖ్యంగా పోస్టల్ వినియోగదారులు ఈ వారోత్సవాల కార్యక్రమాల్లో విధిగా భాగస్వాములై విజయవంతం చేయాలి.
>
> – ఆర్.నవీన్‌కుమార్, సూపరింటెండెంట్, అమలాపురం డివిజన్ పోస్టల్ శాఖ

లోఓల్టేజీతో నరకయాతన

అల్లవరం: మండలం వ్యాప్తంగా లోఓల్టేజీ సమస్యతో గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా అనధికార కరెంట్ కోతలతో ప్రజలు సతమతమవుతున్నారు. కరెంట్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి మండలం వ్యాప్తంగా ఉంది. వారం రోజులుగా ఎండలు ఎక్కువగా నమోదు కావడంతో విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. పెరిగిన వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ అధికారులు కరెంట్ సప్లయ్ చేయడంలో విఫలమయ్యారు. దేవగుప్తం సబ్ స్టేషన్ పరిధిలో మూడు రోజులుగా విద్యుత్‌కు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కరెంట్ ఉన్నా ఆఫ్ అండ్ డౌన్ కావడంతో గృహాల్లో ఫ్యాన్‌లు తిరిగే పరిస్థితి లేదు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు గ్రామాల్లో లేకపోవడంతో సాధారణ స్థాయి కంటే తక్కువగా సరఫరా అవుతుంది. అల్లవరం సబ్ స్టేషన్ పరిధిలో గోడితిప్పలో లోఓల్టేజీ సమస్య రెండు నెలలుగా ఉన్నా నేటికి పరిష్కారం కాలేదు. మొగళ్లమూరు పంచాయతీ పరిధిలోని శిరగట్లపల్లిలో కొన్ని నెలలుగా లోఓల్టేజీ సమస్య ఉన్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి గాలి వీచినా కరెంట్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనధికార కరెంట్ కోతలతో మొబైల్ వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కరెంట్ కట్ అయిన నిమిషాల వ్యవధిలో మొబైల్ సిగ్నల్స్ పడిపోతున్నాయి. దీంతో మొబైల్ వినియోగదారులకు నెట్ వినియోగంతో పాటుగా కాల్స్ వెళ్లని పరిస్థితి నెలకొందని మొబైల్ వినియోగదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వరరావుని వివరణ కోరగా మండలం వ్యాప్తంగా లోఓల్టేజీ సమస్య ఉందని, డిమాండ్‌కు తగ్గ కరెంట్ సరఫరా కావడం లేదన్నారు. గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల కొరత ఉందని తెలిపారు.

కోరింగ అభయారణ్యానికి పర్యాటక హంగులు

తాళ్లరేవు: తూర్పున పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న కోరింగ అభయారణ్యంలో మరిన్ని పర్యాటకు హంగులు కల్పించి ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తెలిపారు. ఆదివారం చొల్లంగిలోని సీబీఈటీ (కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం) కేంద్రంలో వన్యప్రాణి వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే రెండవ అతిపెద్ద అటవీప్రాంతమైన మడ ఫారెస్టును మరింత అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం జాతీయ రహదారి నుంచి అభయారణ్యం వరకు బ్యాటరీ వాహనాలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణకు, వన్యప్రాణుల సంరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతున్న మడ అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనేక కార్యక్రమాలతో అభయారణ్యం అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈబీసీ కేంద్రాలకు రూ.36 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అలాగే వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పిల్లి గోవిందరాజు అనే ఉపాధ్యాయుడు పలు ప్రదర్శనలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ఎస్.బలరామకృష్ణ తన పాటలతో చైతన్యం నింపారు. కార్యక్రమంలో నాయకులు కుడుపూడి శివన్నారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, కట్టా త్రిమూర్తులు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఎం.నాగార్జున, ఎస్.వీరభద్రరావు, బీట్ ఆఫీసర్లు సుభాని, గోపి, ధనలక్ష్మి, సత్యనారాయణ పాల్గొన్నారు.



పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తదితరులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

అమలాపురం రూరల్: బండారులంక గ్రామంలో రూ.2 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం శంకుస్థాపనలు చేశారు. సిమెంట్ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం సర్పంచ్ పెనుమాల సునీత అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మెట్ల రమణబాబు, శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, మాజీ ఎంపీటీసీ బొర్రా ఈశ్వరరావు, నాయకులు పి.చంద్రమౌళి, పిచ్చిక శ్యామ్, లింగోలు పండు, మాధవి తదితరులు పాల్గొన్నారు.



బండారులంకలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడి మృతి

తాళ్లరేవు: విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అరదాడి శ్రీరామచంద్రమూర్తి ఆదివారం మృతి చెందారు. గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురం గ్రామానికి చెందిన ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఏఎస్ఆర్ మండలంలో క్రీడాభివృద్ధికి ఎంతో కృషి చేయడంతో పాటు ఎంతోమంది క్రీడాకారులను తయారు చేశారు. తాళ్లరేవు హైస్కూల్, క్రీడా ప్రాంగణాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. అనేక మందిని క్రీడల్లో ప్రోత్సహించి టోర్నమెంట్లను నిర్వహించడంతో పాటు రాష్ట్రీయ, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. అదే విధంగా సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లో ప్రవేశించి అనతికాలంలోనే మంచి పేరు తెచ్చుకున్నారు. మహిళా కోటాలో ఆయన భార్య కృష్ణకుమారి ఎంపీపీగా ఎన్నికై విశేష సేవలందించారు. ఆయన మృతికి పూర్వ విద్యార్థులు, డైమండ్ గ్రూప్, గోల్డెన్ గ్రూప్, పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.



అరదాడి శ్రీరామచంద్రమూర్తి

వైద్యులు సేవా దృక్పథంతో పని చేయాలి

తాళ్లరేవు: రోగులపై ప్రేమపూర్వకంగా వ్యవహరిస్తూ వైద్యులు సేవా దృక్పథంతో పని చేయాలని సామాజిక ఆస్పత్రి చైర్మన్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు కోరారు. ఆదివారం ఆయన స్థానిక సామాజిక ఆస్పత్రిని సందర్శించి సిబ్బంది, రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీని నిర్మించాలని పలువురు కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రిపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, ఇకపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. డీసీఎస్ డి.స్నేహలత, నాయకులు గుత్తుల సాయి, టేకుమూడి లక్ష్మణరావు, గంజా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటే శ్రేయస్కరం

అమలాపురం రూరల్: రసాయన ఎరువులు, పురుగు మందులు లేకుండా పండించిన ఆహార పంటలే మనిషి ఆరోగ్యానికి మంచిదని సేంద్రియ వ్యవసాయ నిపుణుడు వేణు అన్నారు. ఎస్‌కేబీఆర్ కళాశాలలో వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఈదరపల్లికి చెందిన సేంద్రియ వ్యవసాయ నిపుణుడు తిక్కా వేణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయల పంటలపై ఆదివారం ఉదయం వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో మధుమేహాన్ని నియంత్రించే సుగర్ మొక్కలను వాకర్స్‌కు వేణు అందజేశారు. ఈ మొక్క ఆకులను రోజూ కొన్ని తింటే మధుమేహం క్రమేపీ మామమవుతుందని వేణు వివరించారు. సదస్సులో వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.రాఘవేంద్రరావు, క్లబ్ కార్యదర్శి వలవల నాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, వాకర్స్ ఏరియా కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు భమిడిపాటి పద్మావతి, వాకర్ జవ్వాది తాతబాబు తదితరులు పాల్గొని ప్రసంగించారు.



మధుమేహాన్ని నియంత్రించే మొక్కలను వాకర్స్‌కు పంపిణీ చేస్తున్న సేంద్రియ వ్యవసాయ నిపుణుడు వేణు

ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడిగా రమేష్



అమలాపురం ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గం

అమలాపురం రూరల్: అమలాపురం ఫొటోగ్రాఫర్ల అండ్ వీడియోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గం కొంకాపల్లి సత్తెమ్మ తల్లి గుడి వద్ద ఆదివారం జరిగాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఫొటోగ్రాఫర్ల యూనియన్ అధ్యక్షుడు గెద్దం సురేష్, గౌరవ అధ్యక్షుడిగా కాజాబాబు ఆధ్వర్యంలో అమలాపురం ఫొటోగ్రాఫర్ల నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా సీహెచ్ రమేష్ (బాబి) గౌరవ అధ్యక్షుడిగా కె.కృష్ణ, గౌరవ సలహాదారులు గురు, దీప్తి మోహన్, ఉపాధ్యక్షుడిగా శివకుమార్, సెక్రటరీగా రెడ్డి శ్రీనివాస్, ట్రెజరీగా కోటి, జాయింట్ ట్రెజరీగా శివకృష్ణ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఘనంగా అమ్మవారి గ్రామోత్సవం

కాట్రేనికోన: మండలంలోని చింతలమెరకలో నూతన ఆలయంలో విజయలక్ష్మీ దుర్గ విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా రెండో రోజు అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారి విగ్రహాన్ని గెద్దనాపల్లి, తిమ్మాపురం, చింతల మెరక గ్రామాల్లో ఊరేగించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, రుత్విక్ వరుణ, దీక్షారాధన, సర్వదేవతా ప్రార్థనలు, చతుర్వేద పారాయణ, అకల్మష హోమం తదితర పూజలను నిర్వహించారు. వేద పండితులు నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా కముజు లక్ష్మీ రమణారావు, వనచర్ల సత్యనారాయణ మూర్తి, సంసాని అర్జున, సంసాని దుర్గాప్రసాద్ దంపతులు హోమం, గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

హిందూ ధర్మం ప్రపంచానికే శిరోధార్యం

ముమ్మిడివరం: హిందూ ధర్మం ప్రపంచానికే శిరోధార్యమని అలాంటి ధర్మాన్ని రక్షించుకున్నపుడే దేశం, సమాజం బాగుంటుందని రాష్ట్ర ధర్మ ప్రచారకులు ముద్దు సాయిరామ్ పేర్కొన్నారు. ముమ్మిడివరం కేశవ స్వామి దేవాలయంలో సబ్ డివిజన్ కన్వీనర్ సానబోయిన వీరభద్రరావు, గొలకోటి సాయిబాబు ఆధ్వర్యంలో శనివారం సమరసత సేవా ఫౌండేషన్ గ్రామ కన్వీనర్లు, సహ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మత మార్పిడిని అడ్డుకొని మతం మారిన వారిని తిరిగి మన ధర్మంలోకి తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక సేవకులు తాడి నరసింహారావు, కుక్కల ధర్మారావు, చప్పిడి దానేశ్వరరావు, చింతా వివేక్, వై.అనూష, నల్లా అండాల్ దేవి, గుర్రాల ఆకాశకుమారి, కొప్పిశెట్టి వెంకటలక్ష్మి, కొయ్యల దుర్గారావు, బొంతు కనకారావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సాయిరామ్

జగన్మాతా నమోస్తుతే..

- పలు అలంకరణల్లో దుర్గామాత దర్శనం
- అమ్మవారికి భక్తుల ప్రత్యేక పూజలు



యానాంలో రాజమాతంగి అలంకరణలో శారదాదేవి



సన్నవిల్లిలో లలితాత్రిపుర సుందరిగా అమ్మవారు



అన్నపూర్ణాదేవి అవతారంలో అమలాపురం శ్రీదేవి అమ్మవారు



అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో అన్నపూర్ణాదేవిగా అలంకృతమైన కల్యాణ దుర్గమ్మ

అమలాపురం టౌన్: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం అమలాపురం పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణతో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద పలు హోమాలు జరిగాయి. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో ఆలయం వద్ద జరిగిన భారీ అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని వైష్ణవి కనకదుర్గ ఆలయంలో అమ్మవారు, స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణ దుర్గ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు లలితాత్రిపుర సుందరీ దేవిగా, స్థానిక సావరం బైపాస్ రోడ్డులోగల కనకదుర్గ ఆలయంలో అమ్మవారు లలితాదేవి అవతారాలతో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక గోల్డ్ మార్కెట్ వద్ద గల శ్రీకామాక్షీ ఏకాంబరేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకారుల సంఘాల ఆధ్వర్యంలో ఆ ఆలయం వద్ద శరన్నవ రాత్ర మహోత్సవాలు జరుగుతున్నాయి. నల్లా వీధిలోని కనకదుర్గ ఆలయంలో ఆ వీధి మహిళలు పవిత్ర జలాలతో అభిషేకించారు. వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో ఆర్యవైశ్య మహిళలు గావించిన సామూహిక లలితా పారాయణ భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది.

ఉప్పలగుప్తం: దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని సన్నవిల్లిలో వేంచేసిన కనకదుర్గ అమ్మవారు లలిత త్రిపుర సుందరీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఆదివారం ఉదయం నుంచి మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించి నైవేద్యాలు చెల్లించారు. అనంతరం అమ్మవారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే రాజప్ప

అమలాపురం టౌన్: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీదేవి అమ్మవారు, కన్యకా పరమేశ్వరి దేవి ఆలయాలను పెద్దాపురం ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం సందర్శించారు. అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రెండు ఆలయాల ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే రాజప్పను సత్కరించారు. ఉత్సవ కమిటీల ప్రతినిధులు ఆశెట్టి ఆదిబాబు, నంబూరి సత్యనారాయణమూర్తి, ఎమ్మెన్వీ ప్రసాద్, వరదా సూరిబాబు, పచ్చిగోళ్ల నర్సిబాబు తదితరులు రాజప్పను సత్కరించిన వారిలో ఉన్నారు.

రాజమాతంగి అలంకరణలో శారదాదేవి

యానాం: పట్టణంలో కొలువైన శారదాదేవి సర్వతీదేవి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం శారదాదేవి అమ్మవారు రాజమాతంగి అలంకరణలో దర్శనమిచ్చారు. చుండ్రు శంకరరావు దంపతుల సౌజన్యంతో అమ్మవారికి విశేష పూజలను నిర్వహించారు. అదే విధంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హోమానికి పలువురు మహిళలు హాజరై పూజలు నిర్వహించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

స్థానిక పడవలరేవు వీధిలో కొలువైన లలితాదేవి రాజమాతంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విశేష అర్చనలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అదే విధంగా రాత్రి జరిగిన జాతీయ కూచిపూడి నృత్య కళాకారిణి, కుమారి రావి బేబీసత్యవాణి చేసిన నృత్యప్రదర్శన అందరినీ అలరించింది. కార్యక్రమంలో లలితా భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

దీపావళికి బియ్యం, పంచదార పంపిణీ

యానాం: దీపావళి పురస్కరించుకుని రేషన్‌కార్డు దారులకు 2 కేజీల పంచదార, 10 కేజీల బియ్యం ఉచితంగా అందజేయనున్నట్లు పుదుచ్చేరి సీఎం రంగసామి ప్రకటించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీపావళికి ముందే రేషన్‌షాపులను తెరచి బియ్యం, పంచదార పంపిణీ చేస్తామన్నారు. రేషన్‌షాపులు తెరవాలని ప్రజలు కోరుతున్నారన్నారు. ఈ మేరకు రేషన్‌షాపుల పునఃప్రారంభంపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి అసెంబ్లీ తీర్మానాన్ని పంపినట్లు తెలిపారు.